అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 09 జూన్ 2023

నేడు నసురుల్లాబాద్‌లో భారీ బహిరగసభ

- సభను విజయవంతం చేయాలి : డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సాహాలో భాగంగా శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంక్షేమ సంబరాల బహిరగసభను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం బొమ్మన్ దేవ్ పల్లి చౌరస్తా లో ఉన్న శ్రీ వేంకటసాయి స్కూల్ లో నిర్వహిస్తున్న సంక్షేమ సంబరాల ఏర్పాట్లను డిసిసిబి చైర్మన్ పరిశీలించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి సుమారు పదివేల మంది ఈ సభకు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజవర్గంలోనే మొదటిసారి బహిరంగ సభ ఏర్పాటు చేయడం పై అధికారులు ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల్లో అపశృతి

టపాకాయలు కాల్చడంతో టెంట్ దగ్ధం



నవతెలంగాణ-భీంగల్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 7వ రోజు చెరువుల పండగ సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. నిజామాబాద జిల్లా భీంగల్ మండలంలోని పురాణిపేట్ గ్రామ పరిసరాలలోని చెన్న చెరువు వద్ద నిర్వహిస్తున్న చెరువు పండగకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు కార్యకర్తలు భాణసంచా కాల్చగా.. అవి సమీపంలో కార్యక్రమం నిమిత్తం వేసిన టెంట్‌పై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో తేరుకున్న కార్యకర్తలు మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పినట్లైంది.

మండుటెండల్లోనూ తరగని భూగర్భజలాలు

- నీటిమట్టం పైపైకి
- చెరువుల్లో జలకళ
- గతేడాదితో పోల్చితే పెరిగిన భూగర్భ జలాలు



నవతెలంగాణ-నిజామాబాద్‌ప్రాంతీయ ప్రతినిధి


మే మాసం అంటేనే జనం అమ్మో అంటూ ఉలిక్కిపడతారు. ఎటు చూసినా నెర్రలుబారిన భూములు, ఎండిన చెరువులు, భూతాలంలోకి నీరు, నీటి చుక్క కోసం జనాలు, జీవాల తంటాలు. కానీ ఇదంతా ఒకప్పటి మాట. నేడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. రోహిణి కార్తె ఎండల్లోనూ నిజామాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు తగ్గకపోక మరింత పైపైకి వచ్చాయి. సాధారణంగా మే నెలలో భూగర్భ జలాలు సాధారణ నీటిమట్టం కంటే నాలుగు నుంచి ఐదు మీటర్ల లోతుకు ఇంకిపోతాయి. కానీ ఈసారి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నాలుగు మీటర్ల పైపైకి వచ్చి చేరాయి. ఇక మండుటెండల్లోనూ చెరువులు జలకళ సంతరించుకోవడంతో భూగర్భజలాలకు కొదవ లేకుండా పోయింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగ ఉత్సహంగా నిర్వహించాయి.

నిజామాబాద్ జిల్లాలోని 33 మండలాల్లో 82 ఫీజోమీటర్లు ఉన్నాయి. ప్రతి నెలా భూగర్భజలశాఖ జిల్లాలోని నీటి మట్టాల వివరాలను సేకరిస్తుంది. ఈ మేరకు వ్యవసాయశాఖకు, రైతులకు తగిన సలహాలు, సూచనలు చేస్తోంది. గత మే నెలలో నిజామాబాద్ జిల్లాలో భూగర్భజలాల నీటిమట్టంలో వృద్ధి చోటుచేసుకుంది.

గతేడాదితో పోల్చితే భూగర్భజలాలు పెరిగిన ప్రాంతాలు (మీటర్లలో)

గ్రామం	మే-2022	మే-2023
మాచర్ల	5.29	1.40
గోన్‌గొప్పుల	28.35	21.38
జాగిర్యాల్	10.36	8.30
కమ్మర్‌పల్లి	13.65	11.95
ముప్కాల్	14.05	10.84
కంఠేశ్వర్ (నిజామాబాద్)	24.58	21.80
మల్కాపూర్	13.99	8.26
అర్సపల్లి	5.54	3.59

సాధారణంగా ప్రతియేడాది మే మాసంలో నీటిమట్టం ఆమాంతం పడిపోతుంది. తీవ్రమైన ఎండలకు తోడు చెరువులు ఎండిపోవడంతో ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగంలో చేపట్టిన చర్యలతో ఆ ఫలాలు రైతులకు లాభం కలగచేస్తున్నాయి. ఇందుకు మే మాసంలో పెరిగిన భూగర్భజలాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతేడాది ఆలూరు మండలం మాచర్లలో 5.29 మీటర్ల లోతుకు నీరు ఉంటే.. ప్రస్తుతం అవి 1.4 మీటర్ల పైకి వచ్చాయి. అలాగే ఇందల్‌వాయి మండలం తిర్మన్‌పల్లిలో గతేడాది 5.33 మీటర్ల లోతులో నీరు ఉంటే ఈ యేడాది 2.89 మీటర్ల పైకి వచ్చి చేరాయి. నవీపేట్‌లోని నిజాంపూర్‌లో గతేడాది 3.86 మీటర్ల లోతుకు నీరు ఉంటే.. ఈ యేడాది 2.25 మీటర్ల పైకి వచ్చాయి. రుద్రూరు మండల కేంద్రంలో గతేడాది మే నాటికి 4.37 మీటర్ల లోతుకు నీరు ఉంటే... ఈ యేడాది 2.88 మీటర్ల పైకి వచ్చి చేరాయి. జిల్లాలో వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన 82 ఫీజోమీటర్లలో 37 ప్రాంతాల్లో నీరు పది మీటర్ల లోపు ఉండటం విశేషం. 26 ప్రాంతాల్లో 10-15 మీటర్ల లోపు, 12 ప్రాంతాల్లో 15-20 మీటర్ల లోతు ఉన్నాయి. కేవలం ఏడు ప్రాంతాల్లో మాత్రమే నీరు 20 మీటర్ల దిగువకు ఉన్నాయి. ఇక జిల్లాలో ప్రతియేటా భూగర్భజలాలు పాతాళం లోతుకు ఉండే రెంజల్ మండలం దండిగుట్టలోనూ ఈ యేడాది 14 మీటర్ల పైకి నీరు చేరడం విశేషం. గతేడాది ఈ ప్రాంతంలో 90.90 మీటర్ల లోతుకు నీరు ఉండగా.. ఈ యేడాది 76.03 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో ఏకంగా మూడు నుంచి నాలుగుమీటర్ల పైకి వచ్చి చేరాయి.



మిషన్ కాకతీయతో చెరువుల్లో జలకళ

- 100 శాతం సబ్సిడీతో చేప, రొయ్య పిల్లల పంపిణీ
- ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్ బిగాల
- నేడు, రేపు కొనసాగనున్న స్టాళ్లు



ఫిష్‌ఫుడ్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్ సిటీ

100 శాతం సబ్సిడీతో చేప, రొయ్య పిల్లల పంపిణీ, 4 లక్షల మంది మత్స్యకారులకి ఉపాధి లభిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా మత్స్య శాఖ అధికారి జి.రాజనర్సయ్య ఆధ్వర్యంలో మృగశిర కార్తె ని పురస్కరించుకొని పాత కలెక్టర్ గ్రౌండ్ లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో అతిథులను బతుకమ్మలతో బోనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేప పిల్లల ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, 100 శాతం సబ్సిడి తో ప్రభుత్వం చేప, రొయ్య పిల్లలను అందిస్తుం దని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్య మంత్రి మత్స సంపద గణనీయంగా పెరిగిందని అన్నారు. 4 లక్షల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు అని అన్నారు. చేప ఉత్పత్తులను పెంపొందిం చుటకు, వాడుటకు ఫీష్ ఫుడ్ ఫెస్టివల్స్ చాలా ఉపయోగపడతున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా రాజనర్సయ్య మీడియాతో మాట్లాడుతూ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో రకరకాల చేప వంటకాలు సందర్శకులను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఫీష్ ఫుడ్ ఫెస్టివల్‌లో చేప పకోడి, చేప ఫ్రై, బొండిలు, ఎండు రొయ్యలు, ఎండు చాపలు ఇలా పలు రకాల వంటకాలు నోరూరించే విధంగా ఉన్నాయని సందర్శకులు కితాబు ఇచ్చినట్టుతెలిపారు. సందర్శకులు రుచులను ఆస్వాదించారని ప్రశంసించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎఫ్ఎఫ్‌వో నగేష్, ఫిషరీస్ శాఖ సిబ్బంది, కార్పొరేటర్ లు, నాయకులు మత్స శాఖ అధికారులు పాల్గొన్నారు.



చేపలతో వివిధ రకాల వంటకాలు

సత్యం, న్యాయం, ధర్మం అనుసరించాలి

- ఆలయంలో విగ్రహప్రతిష్టాపనలో స్పీకర్ పోచారం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

గ్రామాలలో ఆలయాలు నిర్మించుకోవడం మంచి సంప్రదాయమని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సత్యం, న్యాయం, ధర్మం ఎక్కడుందో దానిని అనుసరించాలన్నారు. కొంతైనా కొంత పాటించాలని లేనిపక్షంలో రాక్షసులకు మనుషులకు తేడా లేదన్నారు. మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో పబ్బతి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్‌షిండేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన చేసుకోవడం మంచి బాట వేస్తుందన్నారు. ఐదు రోజుల కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన తో పాటు ఓ యజ్ఞము నిర్వహించడం, ఈ కార్యక్రమంలో వేలాది మంది దర్శనం చేసుకోవడం.. సాంప్రదాయాన్ని ఆచరించడమే అని అన్నారు. మంచి చేయకున్న చెడు మాత్రము చెయ్యొద్దని, మంచి చేయడం వల్ల ఆయుష్షు పెరుగు తుందన్నారు. ధర్మ పాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. మంచి కార్యక్రమాలు చేసి ఎవరి పరిధిలో వారుండాలని సూచించారు.

నూతన విద్యా విధానంపై సదస్సు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న డీఈవో

నూతన విద్యా విధానంపై ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గురువారం నిజామాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో సదస్సు నిర్వహించారు. కేంద్రీయ విద్య విధానంలో భాగంగా నిజామాబాద్‌లోని విద్యాలయాలు జూన్ 1 నుండి 15 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'జన్ భాగీదారీ' కార్యక్రమాలలో భాగంగా గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ సదస్సును ఉద్దేశాన్ని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నూతన విద్యా విధానం, భారతీయ విద్యా విధానాన్ని ప్రపంచానికి అవసరమైన మానవ వనరులను తయారు చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సులో భాగంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి గురించి ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర విద్యాలయ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ సదస్సులో ఫౌండేషన్ స్టేజ్‌లో కావలసిన బోధన ఉద్దేశాలు, విధానాల గురించి కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు ప్రియ, సాయి ప్రసాద్, కుమారి అన్నపూర్ణ, శాగుఫ్త, అభిలాష్ వేర్వేరు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో సదస్సులో వివరించారు. డైట్ కాలేజీ లెక్చరర్ సంజీవరావు, ఉపాధ్యాయ విద్యలో నూతన విద్యా విధానంతో రాబోతున్న మార్పులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ, తెలంగాణ బోర్డుతో గుర్తింపు పొందిన పలు పాఠశాలలకు చెందిన ప్రాథమిక, పూర్వ ప్రాథమిక బోధన చేసే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలు సస్యశ్యామలం

- 50 ఏండ్ల వెనుకబాటును 9 ఏండ్లలో దూరం చేశాం
- చెరువుల పండుగలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



నృతం చేస్తున్న మంత్రి వేముల, కలెక్టర్ తదితరులు

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలను సస్యశ్యామలం చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో బాగంగా 7వ రోజు చేపడుతున్న చెరువుల పండగ ఉత్సవాలలో బాగంగా మండలంలోని పురాణిపేట్ గ్రామశివారులో గల చెన్న చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం 50 సంవత్సరాలలో చాలా వెనకడిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో తాగడానికి నీరు లేక ఖాళీ బిందెలతో నిరసనలు చేసే వారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా గ్రామగ్రామాన మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీటి నల్లాలను బిగించి తాగునీరు అందించారని అన్నారు. గ్రామలను సస్యశ్యామలం చేసేందుకు కంకణబద్దుడై అందకు కావాల్సిన చెరువులకు పూర్వవైభవం తీసువచ్చేందుకు మిషన్‌కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత చేపట్టి వ్యవసాయరంగానికి మంచిరోజులు తీసువచ్చారన్నారు.

200 కోట్లతో కాళేశ్వరం నీటిని 300 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్‌తో రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్‌కు తీసుకువచ్చి అట్టి నీటిని 21 ఫ్యాకేజీ ద్వారా బాల్కొండ నియోజకవర్గం లోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీంగల్, జక్రాన్‌పల్లి మండలాల రైతాంగానికి సాగు నీరందించే కార్యక్రమం కూడా పూర్తయిందన్నారు. మరికొన్ని రోజుల్లో రైతుల పొలాలో 3 ఎకరాలకు ఒక బోరు ఏర్పాటు చేయనున్నమని తెలిపారు. అలాగే ఈ నీటితో చెక్‌డ్యాంలను కూడా నింపను న్నట్టు తెలిపారు.

పురాణిపేట్‌లో రూ.20 కోట్ల అభివృద్ధి

పురాణిపేట్‌లో 20 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 9 కోట్ల 50 లక్షలు పెన్షన్‌లు, 1 కోటి రూపాయలు కళ్యాణలక్ష్మికి, 23 మందికి 36 లక్షలు సీఎంఆర్ఎఫ్ , 42 లక్షలు గొల్లకుర్మలకు, 3 కోట్ల 30 లక్షలు రైతు బంధుకు , 6 మంది రైతు కుటంబాలకు 30 లక్షల రైతు బీమా అందించామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, మండల ప్రత్యేకాదికారి సింహచలం, ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ నాయకులు , పురాణిపేట్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ఊరేగింపు

కేసీఆర్ ప్రభుత్వం అవినీతిమయం

- మాట ఇచ్చి మాట మార్చిన కేసీఆర్
- బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- అవకాశం ఇస్తే గజ్వేల్ నుంచి పోటీ చేస్తానని వెల్లడి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటని, పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శిం చారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని కొయ్యగుట్ట వద్ద చేరుకొని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి బీఎస్పీ కార్యకర్తలతో రెండు కిలోమీటర్లు ర్యాలీతో బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. అక్కడే పార్టీ జెండాను ఆవిష్కరిం చారు. అక్కడి నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్దకు చేరుకొని అక్కడ విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణాలో నిరంకు శమైన పాలన కొనసాగుతు న్నదని, కెసిఆర్ తాను, తన కుటుంబం తరువాత తన వారసులు అనే విధంగా వ్యవహరిస్తు న్నారే తప్ప ప్రజల గురించి పట్టించు కోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి మయంగా మారిందన్నారు. దళితులను ముఖ్య మంత్రి చేస్తానని గతంలో కేసీఆర్ ఇచ్చి మాట మార్చారు. కెసిఆర్ ప్రభుత్వం లీకేజీల ప్రభుత్వమని ఆయన దుయ్యపట్టారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి నినాదాలు చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అరికట్టడంలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైనదన్నారు. దళిత బంధు వాహనముల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా ప్రశ్నించిన అధికారులను ఏసీబీ కేసులు చేసి భయపెట్టిస్తున్నదన్నారు. ఏసీబీ కేసులో నమోదైన విషయాలలో ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న అధికారులకు స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని, ప్రభుత్వానికి అనుకూలంగా లేని అధికారులకు 60-70 రోజులు జైలుకు పంపుతున్నారని తెలిపారు. తెలంగాణలో బహుజన రాజ్యం వస్తుందని నమ్ముతున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు.

అధిష్టానం అవకాశం ఇస్తే గజ్వేల్ నుంచి పోటీ

తెలంగాణ ప్రజలు తనను గజ్వేల్ నుంచి కూడా పోటీ చేయాలని అడుగుతున్నారని పార్టీ ఆదేశాను సారం తెలంగాణలో ఎక్కడి నుంచి అయిన పోటీ చేస్తానన్నారు. అధిష్టానం అవకాశం ఇస్తే తప్పకుండా గజ్వేల్ నుంచి పోటీ చేస్తానన్నారు. ఇతర పార్టీలలో ప్రస్తుతం పని చేస్తున్న కార్యకర్తలు అందరూ తమ బహుజన పార్టీ బిడ్డలే అని, వారిని కలుపుకుని రాష్ట్రంలో రాబోయే ఎన్నికలలో తాము ప్రతి నియోజకవర్గంలో స్వతంత్రంగా ఎన్నికల బరిలో నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల, గ్రామాల బిఎస్పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ప్యాకేజీ పనులు చేపడతాం

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ
- భూంపల్లి ప్రాజెక్టు వద్ద నిరసన



భూంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 20, 21, 22 ప్యాకేజీ పనులు రెండేండ్లలో పూర్తి చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం సదశివనగర్ మండలంలోని భూంపల్లిలో గురువారం ప్రాణహిత చేవెళ్ల (కాళేశ్వరం) ప్యాకేజీ 20,21,22 సాధనకై ధర్నా కార్యక్రమంలో పాల్గొని ప్రాజెక్ట్ పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లల్లో 19 కోట్ల నిధులు విడుదల చేసి పనులు మాత్రమే చేపట్టిందని, వెయ్యి కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 3 నెలలో పనులు చేపట్టి రెండేండ్లలో పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. కాళేశ్వరం నీరు గుండ్ల పోచంపల్లి, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్లను పూర్తి చేశారని, సిద్దిపేట్, సిరిసిల్లా, గజ్వేల్ నియోజకవర్గాలను అభివృద్ధి చేసి మిగతా వాటిని విస్మరించారని అన్నారు. పసుపు బోర్డు లేదు.. మద్యంపై ఆదాయం గతంలో 10 వేల కోట్లు వస్తే.. ప్రస్తుతం 44 వేల కోట్లకు చేరిందని, రాష్ట్ర ప్రజలను తాగుబోతులను చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇంకా ఈ సంబరాలు ఎందుకని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, పండ్ల రాజు, జైపాల్ రెడ్డి, కోతి లింగారెడ్డి, మహేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, కవీన్ సంతోష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన రైతు సమన్వయ కమిటీ నాయకులు సాయిలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ

డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ మండలంలోని ఘనపూర్ గ్రామ చెరువు లో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పుడే ఆ చెరువు వద్ద తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చెరువుల వద్ద పండగ చేస్తుండగా.. గ్రామస్తులు చుసి కేకలు వేయడంతో అటువైపు వెళ్తున్న ఘనపూర్ గ్రామ రైతు సమన్వయ కమిటీ నాయకులు గంగి చిన్న సాయిలు వెంటనే చెరువులో దూకి ఆమెను ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. ఆమె నడపల్లి గ్రామానికి చెందిన మహిళాగా గుర్తించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సాయిలు సాహసాన్ని అక్కడున్న వారు అభినందించారు.

ఆలయంలో చోరీ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో దుండగులు దోపిడీకి పాల్పడినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు రూ.50వేల నగదు, బంగారు పుస్తెలు, వెండి వస్తువులు దుండగులు ఎత్తుకెళ్ళినట్టు తెలిపారు. గురువారం ఉదయం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు రోజువారీ విధానంలో ఆలయానికి వెళ్లగా దుండగులు దోపిడీకి పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల పండుగ


ఖానాపూర్‌లో..

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని శ్రీనగర్ గ్రామంలో బోనాల పండుగను సర్పంచ్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మల్లారంలో వైసీపీ అన్నం సాయిలు ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా తీశారను. ఒకటో డివిజన్ ఖానాపూర్‌లో కొర్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా తీశారు.

తెలంగాణ.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- ఎమ్మెల్సీ కవిత
- ఘనంగా చెరువుల పండుగ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ షకీల్ అమీర్‌లకు మండలంలోని నెహ్రూనగర్ గ్రామం నుంచి మంగల్‌పాడ్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. మంగల్‌పాడ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పార్టీ ప్రజాప్రతినిధులు, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజితా ఎల్లయ్య యాదవ్, ఎంపీపీ కే శ్రీనివాస్‌తో పాటు ఎంపీటీసీలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గజమాలవేసి స్వాగతించారు. అక్కడి నుంచి బతుకమ్మ చెరువు కట్టకు వెళ్లి అక్కడున్న కట్ట మైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపంచాయతీ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని బతుకమ్మ చెరువుల వద్ద పండగను నిర్వహించారు. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులతో ఊరేగింపుగా చెరువు కట్టకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ప్రాజెక్టు నిర్మించి రైతులకు సాగునీటిని అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆసరా పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల తెలంగాణ రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వారు గుర్తు చేశారు. ఏది ఏమైనప్పటికీ రానున్న ఎన్నికల్లో మరో మారు తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్‌కే మళ్లీ పట్టం కడతారని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. బోధన్ ఎమ్మెల్యే ఎమ్‌డీ షకీల్ అమీర్‌ను స్థానిక ప్రజలు మరోమారు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాల చెరువు కట్ట వద్ద ఊరూరా చెరువుల పండగ కార్యక్రమాలను గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, కుల సంఘాల పెద్దలు మహిళలు పాల్గొని ఘనంగా నిర్వహించారు.

ఎడపల్లి గురుకుల పాఠశాల కళాశాలను అభివృద్ధి చేస్తాం..

ఎడపల్లి గురుకుల పాఠశాల కళాశాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డితో పాటు నలుగురు స్కౌట్ సుమారు 50 మంది బాలికలు పాఠశాల ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ చెరువు కట్ట వద్ద సమావేశంలో ఎమ్మెల్సీ కవితను ఎమ్మెల్యే ఎమ్‌డీ షకీల్ అమీర్‌ను, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా ఎల్లయ్య యాదవ్ సహకారంతో కలిశారు. పాఠశాలలో, కళాశాలలో పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం పట్ల వారు ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డిని అభినందించారు. అలాగే స్కౌట్ బాలికలు చదువుతోపాటు క్రీడారంగంలో ప్రతిభ కనబర్చడం పట్ల బాలికలను ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ నెల 20వ తేదీన తెలంగాణ విద్య దినోత్సవ కార్యక్రమాలు ఉన్నందున తమ పాఠశాలకు ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్యే ఎండి షకిల్ అమీర్ తప్పకుండా హాజరు కావాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు మల్కారెడ్డి, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, ఎంపీటీసీలు వనజ నాగరాజు, పద్మ ముత్తన్న, నాయుడు స్రవంతి పోతన్న, మనీషారెడ్డి, ఎంపీడీవో గోపాల్‌కృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు, ఆయా గ్రామాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో సంబురంగా చెరువుల పండుగ..

కమ్మర్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను సంబురంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామం నుంచి చెరువు సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయాల వరకు బోనాలు, బతుకమ్మలు, వలగొడుగుతో ఊరేగింపులు నిర్వహించారు. కట్ట మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, అక్కడే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మండల గ్రామస్థాయి అధికారులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, మత్స్యకారులు, రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఎడపల్లి : ఎమ్మెల్సీ కవితకు గజమాలతో స్వాగతం..


కమ్మర్‌పల్లిలో..

అంబరాన్నింటిన ఊరుర చెరువుల పండుగ..

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ఊరూరా చెరువుల పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. చెరువుల సంబరాలతో పాటు మృగశిర కార్తె (మిర్గ) తోడవడంతో ప్రజలు చేపలను కొనుగోలు చేసుకుని పండుగలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్పంచులు ముందుకు వచ్చి మేకలను, గొర్లను కొనుగోలు చేసుకుని బోనాలు, డప్పు వాయిద్యాలతో చెరువుల వద్దకు వెళ్ళి పండుగను చేసుకున్నారు. కార్యక్రమాల్లో నిజామాబాద్ ఆర్డీఓ రవి, తహసీల్దార్‌లు శ్రీనివాస్ రావు, టీవీ రోజా, ఎంపీడీఓలు గోపి బాబు, రాములు నాయక్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు రఘునాథన్ రాము, సర్పంచ్ నర్సయ్య, కార్యదర్శి శ్రీధర్, కారోబార్ నరేందర్, షేక్ అసిఫోద్దిన్ తోపాటు ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొడిచర్లలో..

మెండోరా : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మెండోరా మండలంలో గ్రామ గ్రామాన ఊర చెరువుల పండుగ ఉత్సవాలు నిర్వహణలో భాగంగా కొడిచర్ల గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి చెరువుల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెరువు గట్టుపై పండగ వాతావరణం నెలకొంది. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పూజలు నిర్వహించి డప్పులు, బోనాలు, మా ఊరి చెరువు ఇతర డీజే పాటలతో, మత్స్యకారుల వలతో గ్రామంలో ఊరేగింపు చేసి పండుగ వాతావరణం ప్రతిబింబించేలా ముగ్గులు, తోరణాలతో అందంగా అలంకరించారు. మిషన్ కాకతీయ పనులతో పెరిగిన పంటల ఉత్పత్తి వివరాలు, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల, తదితర వివరాలను ఫ్లెక్సీలపై రాయించి ప్రజలకు వివరించి మిషన్ కాకతీయ పనుల ద్వారా చెరువుల సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు అధికమయ్యి ఆయకట్టుకు ఎకరాలలో పంటల సాగు స్థిరీకరణమై మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడిందని ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామస్తులకు సూచించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రజలతో కలిసి చెరువు కట్టపై సంక్షిప్త భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయగౌడ్, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురిత్‌రెడ్డి, జడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ వడాల సరస్వతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ వరిగడ్డి వనిత రవీందర్, ఉప సర్పంచ్ ఇట్టెడి గంగారెడ్డి, సెక్రటరీ నీత, అంగన్వాడీ సిబ్బంది మంజుల, సునీత, ఆశావర్కర్లు, సీఏ లావణ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, మత్స్యకారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సంబురాలు..

మాక్లూర్ : మండల కేంద్రంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు చెరువుల ఉత్సవాలను గ్రామ కమిటీ, గ్రామపంచాయతీ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్తవారు వలతో, మహిళలు బతుకమ్మ బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా శోభాయాత్రగా చెరువులోకి చేరుకొని బతుకమ్మలను వదిలారు. కట్టమైసమ్మకు బలిదానం చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు హాజరయ్యారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ అశోక్ కుమార్, ఉపసర్పంచ్ దర్గల వనిత సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాక్లూర్ : చెరువులో బతుకమ్మలను వదులుతున్న దృశ్యం


ఇందల్వాయి : మల్లాపూర్‌లో..

ఊరూరా చెరువుల పండుగ..

ముప్కాల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల పండుగను అధికార పార్టీ నాయకులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామస్థులు చెరువు కట్టల వద్ద కట్ట మైసమ్మకు డప్పులు వాయిద్యాలతో పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామ ప్రజలు చెరువు కట్టల వద్ద భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మెండోరా : కోడిచర్లలో..

ఘనంగా ఊరూర చెరువుల పండగ

బోధన్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సాలూర, బోధన్ మండలాల్లో గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయతీ వద్ద నుంచి బోనాలు, బతుకమ్మలతో మహిళలు, వలలతో గంగపుత్ర సంఘం సభ్యులు, రైతులు ఊరేగింపుగా తరలివెళ్లారు. చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సాలూర తహసీల్దార్ పడాల మమత, ఎంపీపీ బుద్దె సావిత్రి మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని ఆలయం వరకు నడిచివెళ్లారు. అనంతరం చెరువు వద్ద గంగా హారతి చేపట్టి తెలంగాణ సంప్రదాయం ప్రకారం తెప్పలు వదిలారు. మహాలక్ష్మి పోచమ్మ మందిరం వద్ద ఉన్న చెరువు వద్ద అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, సర్పంచ్ బుయ్యన్ చంద్రకళ, ఎంపీటీసీ కండెల సవిత, వార్డు సభ్యులు జ్యోతి, గోదావరి, సాయిలు, గంగాధర్, బుయ్యన్ సురేష్, వెంకట్ పటేల్, బాసరే శివకాంత్, కేజీ గంగారం, బచ్చు రాజు, మామిడి రాజు, రత్నల్లి లింగయ్య, మల్లెపూల లక్ష్మణ్, నీరడి నాగేష్, ఉషం గంగారాం, బండే గంగాధర్, మల్లెపూల సంతోష్, కుల సంఘాల పెద్దలు, మాన్‌కార్‌లు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెరువుల పండగ..

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి ఆధ్వర్యంలో చెరువుల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ కార్యాలయం నుంచి బెల్లాల్ చెరువు వరకు భాజాభజంత్రీలతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. అనంతరం చెరువు వద్ద మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు, డిప్యూటీ ఇంజనీర్ శివానంద్, మేనేజర్ నరేందర్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


బోధన్‌లో..


ముప్కాల్ : వేంపల్లిలో..

కొనసాగుతున్న బడిబాట


బడిబాటలో నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని బోధన్ మండలంలో ఉపాధ్యాయులు కొనసాగిస్తున్నారు. గురువారం మండలంలోని అందాపూర్ కాంప్లెక్స్‌లోని, అందాపూర్, ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి, బెల్లాల్, రాజీవనగర్, లంగ్డాపూర్, బర్దిపూర్ గ్రామాలలో ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రయివేటు పాఠశాలలో కాకుండా, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత బోధన, ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలంతో పాటు, ఆంగ్లం మాధ్యమంలో బోధన అందజేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, హన్మంతరావు, సత్యనారాయణ, నాగయ్య, ఖలీల్ మోద్దీన్, వసుందర, లచ్చయ్య, రాకేష్, ఆరిఫా, ఖలీల్ అహ్మద్, ధనరాజ్, పీయల్.రాజు, సుష్మ హేమలత, సి.ఆర్.పి శివానంద్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బీలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ప్రాంతీయ అధికారిని మేరీ ఏసు పాదం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్- 15 భారత జట్టులో నిజామాబాద్ జిల్లా నుంచి ఐదుగురు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు గోక సాత్విక, గోక శ్రావిక, గూగులోతు సౌందర్య సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి), దాసరి సరియు సాంఘిక సంక్షేమ పాఠశాల ధర్మారం), సుంకపాక సౌమ్యరాణి (సాంఘిక సంక్షేమ కళాశాల కామారెడ్డి జిల్లా తాడ్వాయి), ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 13 నుంచి 17 వరకు తైవాన్ దేశంలోని తైపిలో జరిగే ఏషియన్ చాంపియన్ షిప్ పోటీలలో భారత జట్టుని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలని మేరి ఏసుపాదం అన్నారు. ఎంపికైన ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అకాడమీలోని ప్రత్యేక శిక్షణ పొందుతున్న క్రీడాకారులని, వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ జిల్లా కోఆర్డినేటర్ నీరజరెడ్డి, తాడ్వాయి వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్‌లు వేముల మౌనిక, ఇట్యాల నరేష్ పాల్గొన్నారు.

ప్రయివేటు వద్దు.. ప్రభుత్వ స్కూలే ముద్దు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రయివేటు వద్దు ప్రభుత్వమే ముద్దు అంటూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లల్ని చేర్చి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ఆరుగురు పిల్లల్ని బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూప, పనిశ్రీ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేములకు స్వాతంత్ర్య సమరయోధుల చారిత్రక పుస్తకాన్ని అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ స్వాతంత్ర్య చారిత్రాత్మక అంశాలు సేకరించి, రూపొందించిన పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, వేముల ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుస్తకాన్ని, జ్ఞాపికను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం నేటి యువతర భవిష్యత్తు కోసం వ్యక్తిగతంగా ఆదర్శ ఆలోచనతో సమాజానికి తన వంతు సేవలందిస్తున్న పట్వారి తులసి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపి, అభినందించారు. పట్వారి తులసి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు, చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడికి సన్మానం


జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముదిరాజ్ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మెతుకు శివకుమార్‌ను పలువురు నాయకులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ముదిరాజుల జాతీ బలోపేతానికి, తమ హక్కుల సాధన కోసం తన వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్టల భూమయ్య, యూత్ వింగ్ ఇంచార్జ్ మొగిలి (మురళి), ముబారక్‌నగర్ కుల పెద్దలు కొమురయ్య, భీమయ్య, పోలీసు రాజన్న, నరసయ్య, మొగులయ్య, మల్లేష్, వెంకట్, రమేష్, ఆనంద్, స్వామి, వెంకట్రావు, నరసయ్య, శ్రీకాంత్, నర్సింలు, అశోక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులవృత్తి దారుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కులవృత్తి, చేతివృత్తి దారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం రోజు మండల అభివృద్ధి అధికారి దామోదర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 లోపు టీఎస్ వోబీఎంఎంఎస్ బీసీ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. ఆన్ లైన్ లో దరఖాస్తులు పూర్తి చేసిన తర్వాత అట్టి దరఖాస్తులను మండల పరిషత్తు కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

'నారాయణ' స్కూల్‌కు అన్నీ అనుమతులు

- నారాయణ స్కూల్ ఏజీఎం శివాజీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రజలకు నారాయణ టెక్నో స్కూల్‌ను అందుబాటులోకి తెచ్చామని నారాయణ స్కూల్ ఏజీఎం శివాజీ గురువారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు తీసుకుని స్కూలును సుభాష్‌నగర్‌లో ప్రారంభించామని ఆయన చెప్పారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్యను, ఈ విద్యాసంస్థ నుంచి అందించడమే లక్ష్యంగా నారాయణ విద్యా సంస్థను స్థాపించామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు పోకుండా, పాఠశాలకు వచ్చి సందర్శించాలని తెలిపారు. పాఠశాలలో అత్యాధునిక, సౌకర్యాలతో, నాణ్యమైన విద్యను అందించడానికి, నారాయణ బృందం పని చేస్తుందని అన్నారు. ఇప్పటికే 200కు పైగా అడ్మిషన్స్ వచ్చాయని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.



పాఠశాలల్లో నర్సరీ, పిపి-1, పీపీ-2, విద్యార్థు లకు ఆట పాటలతో ఇంటిని సైతం మరిపించే విధంగా బోధనా విధానం, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు పాఠశాల విద్యతో పాటుగా, నూతన సాంకేతిక పరిజ్ఞా నాన్ని అదనంగా చేరుస్తూ విద్యాబోధన చేపట్టనున్నామని తెలిపారు. 6 నుంచి 10తరగతి విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ స్థాయిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందుబాటులో ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు ఒకసారి పాఠశాలను సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

పలు గ్రామాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దుర్గమ్మకు గ్రామదేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గ్రామస్తులు అన్ని కులాలకు చెందిన వారు ఎడ్లబండ్లను అలంకరించి గ్రామ సమీపంలోని దుర్గమ్మ ఆలయం వరకు ఎడ్లబండ్ల ఊరేగింపు కొనసాగింది. ఎడ్లబండ్ల ప్రదర్శన కార్యక్రమంలో కుల సంఘాల పెద్దలు గ్రామ అభివృద్ధి కమిటీ పెద్ద గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ సోషల్‌మీడియా ఇన్‌చార్జి ఎంపిక



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని కాయితితండాకు చెందిన భామన్ సురేష్‌ను ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా నియమిస్తూ టిపిసిసి సోషల్ మీడియా ఇన్చార్జ్ నవీన్ పెట్టం గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భామన్ సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నాపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం



రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో..

నవతెలంగాణ-రామారెడ్డి/జుక్కల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసనతో పాటు అక్షరాభాస్యం చేయించారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆరు నెలలు పూర్తయిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మూడు సంవత్సరాలు దాటిన కిషోర్ బాలాలను అంగన్వాడీలో చేర్పించాలని, రికార్డులో పేరు నమోదు చేసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ శ్రీలత, సూపర్వైజర్ ఉమాదేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్ మండలం కేమ్రాజ్‌కల్లాలీ తండాలో..

అంగన్ వాడిలో అక్షరాభ్యాసం

జుక్కల్ : మండలంలోని కేమ్రాజ్ కల్లాలీ తండా అంగన్ వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ వినోదా ఆద్వర్యంలో పిల్లలకు అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించినట్టు టీచర్ రాధ తెలిపారు. సూపర్ వైజర్ వినోదా మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, వైద్యం, గర్భిణిలకు, బాలింతలకు, శిశువుకు అందిస్తున్న వైద్య సౌకర్యాలు పాల్గోన్న మహిళలకు వివరించారు. అనంతరం పిల్లలకు సూపర్ వైజర్ చేతుల మీదుగా అక్షరభ్యాసం చేయించారు. టీచర్ రాధ మాట్లాడుతూ గర్భిణిలు, బాలీంతలు, పిల్లలకు తాజా కూరగాయలు, పౌష్టికాహారం, పాలు, గుడ్లు అందించడంతో పాటు నిత్యం వారికి వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యవపరిక్షలు నిర్వహించి , బలహీనంగా ఉన్నవారికి ప్రత్యేకంగా పౌష్టికాహారం బుస్టర్ డోస్ అందిస్తున్నామని తెలిపారు. కిచెన్ గార్డెన్‌లో పండించిన రసాయన మందులు వాడకుండ పెంచిన కూరగాయలను వండి వడ్డిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వినోదా, టీచర్ రాదా, ఆయాలు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు, నోట్‌బుక్‌లు పంపిణీ



పుస్తకాలు, నోట్‌బుక్‌లు అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను, నోటుబుక్కులు, ఏకరూప దుస్తులు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాఠశాలలో నిర్వహించే విద్యా దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్య అధికారి వెంకటేశం పంపిణీ చేశారు. అదేవిధంగా మండల పరిషత్ అధ్యక్షురాలు మాధవి బాలరాజు గౌడ్, జడ్పిటిసి సభ్యులు ఉషా గౌడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండలానికి 20,052 పుస్తకాలు వచ్చినట్టు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఒక జత చొప్పున ఏకరూప దుస్తులు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనితోపాటు పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈసారి నూతనంగా నోటుబుక్కులు సైతం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం లోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


పీఆర్‌సీ కమిటీని నియమించండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పీఆర్‌సీ కమిటీని నియమించాలని ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతారెడ్డి కోరారు. గురువారం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి మాట్లాడుతూ.. 1 జూలై 2023 నుంచి కొత్త పీఆర్‌సీ అమలు చేయాలని, కావున వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి, మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు పున్షప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు, బుక్స్, విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, రాష్ట్ర సెక్రెటరీ పోల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షలు శ్రీనివాస్, జిల్లా మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బోనాల పండుగ

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికి ఒక బోనం చొప్పున తీసుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వ హించారు. గ్రామదేవతల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంజీవులు, ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగ

- బోనాల ఊరేగింపు.. బతుకమ్మ ఆటలు
- చెరువుగట్టుపైనే భోజనాలు

నవతెలంగాణ-విలేకరులబృందం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలల్లో భాగంగా గురువారం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. చెరువుల పరిసరాలను ముస్తాబు చేశారు. ఆయకట్టు రైతులు గ్రామస్తులు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఇంటింటికి బోనాల అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు సప్పులతో బోనాల ఊరేగింపు చెరువు కట్ట వద్దకు కొనసాగింది. చెరువు కట్ట వద్ద ఉన్న కట్ట మైసమ్మ, గంగమ్మ, పెద్దమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువు గట్టుల మీదనే భోజనాలు చేశారు.



ఎల్లారెడ్డిలో బోనాలతో ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్తున్న మహిళలు

లింగంపేట్ : మండలం వ్యాప్తంగా వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండలంలోని మోతే, పోల్కంపేట్, చౌదరిచెరువు, నల్ల మడుగు, లింగంపల్లి, ఒంటరపల్లి, కోమటిపల్లి, పోతాయిపల్లి, శెట్టిపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, ఎక్కపల్లి సజనపల్లి, అయ్యపల్లి, మేంగారం, బోనాల్, భయంపల్లి, కన్నాపూర్, ముస్తాపూర్, ఎల్లారం, రాంపూర్, జల్దిపల్లి, భవానిపేట్, మంబోజిపేట, కొండాపూర్, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నటువంటి చెరువులను అలంకరించి వేడుకలు నిర్వహించారు.



లింగంపేట్ : బతుకమ్మలతో..



మద్నూర్: ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

జుక్కల్ : మండలంలోని మహ మ్మదాబాద్, లాడేగాం, పడంపల్లి, ఖండేబల్లూర్, పెద్ద ఎడ్గి,లొంగన్, జుక్కల్ , కేమ్రాజ్ కల్లాలీ, వజ్రఖండి , డోన్గాం, సోపూర్, పెద్ద గుల్లా, చిన్న ఎడ్గి, నాగల్ గావ్ , కౌలాస్, దోస్పల్లి, బిజ్జల్ వాడి, హంగర్గ, మాదాపూర్, మైబాపూర్, చండేగాం జీపిలలో పండుగల నిర్వహించారు. ఈ చెరువుల పండుగలో సర్పంచులు సాయిలు, ఆశ్విని, మహనంద, ఉషారాణి, కళావతి , యాదవ్, వినోద్, సునిత, సంజీవ్, కపిల్ పటేల్, రమేష్ దేశాయి, హన్మండ్లు, గణేష్ పటేల్, బాలమణి, దినేష్, షిండే అనితా, శాలీని పటేల్ , జేపిఎస్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని వెంకటాపూర్, కొక్కొండ, మల్లయ్య పల్లి, భిక్కనూర్‌తో పాటు పలు గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు.

దోమకొండ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చెరువుల పండుగను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ అంజలి, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, ఎంపీడీఓ చెన్న రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, సర్పంచ్‌లు నర్సవ్వ, ఏవో పవన్, తహసీల్దార్ కౌశిక, నాయకులు నల్లపు శ్రీనివాస్, నాగరాజు,ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.



జుక్కల్ : చెరువు వద్ద భోజనాలు చేస్తున్న ప్రజలు, రైతులు

చెరువుల పండుగ

మద్నూర్ : మద్నూర్ మండలంలోని హెచ్ కెలూరు గ్రామంలో గురువారం బోనాల పండుగ సాయంత్రం బతుకమ్మ పండుగ చెరువులో అన్నదాన కార్యక్రమం పండుగ వాతావరణంలో గ్రామ సర్పంచ్ నీలావతి హనుమాన్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు విజయ్, హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్, గ్రామ పెద్దలు వందలాదిగా మహిళలు చిన్నారులు ఉత్సాంగ పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో దశబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం 9 గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు. బోనాలను డప్పు వాయిద్యలతో ఊరేగింపుగా తీసుకెళ్లి వేడుకలు చేపట్టారు.

మద్నూర్ : మద్నూర్ మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ విట్టల్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పశు వైద్య డాక్టర్ విజయ్, సొసైటీ మాజీ చైర్మన్ పాకలవార్ విజయ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఎంపీటీసీలు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- ఊరూరా చెరువుల పండుగలో ఎమ్మెల్యే జాజల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గత ప్రభుత్వాలు కంటే తెలంగాణ వచ్చినా తరువాత సిఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తెలంగాణ రాక ముందు మన రాష్ట్రం ఎలా వుండే ఇప్పుడు ఎలా ఉంది అని ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఊరూరా చెరువు పండుగలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో లింగారెడ్డిపెట్ వార్డు చెరువులో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు పల్లె దవాఖాన, బతుకమ్మ మెట్లు, ఎస్‌సి కమ్యూనిటీ హల్, బిసి కమ్యూనిటీ హల్‌ను ప్రారంభించారు. లింగారెడ్డి పెట్ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ లింగారెడ్డి పెట్ తనకు రాజకీయ జన్మ నిచ్చిన ఊరు అని లింగారెడ్డిపెట్ ప్రజలకు ఎంతో రుణపడి ఉన్నా అని అన్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే లు ఏమి అభివృద్ధి చేయలేదని తాను ఎమ్మెల్యే అయిన తరువాత సెంటర్ లైటింగ్, డివైడర్, పెద్ద చెరువు కట్టపై బ్రిడ్జిలు నిర్మించినట్టు తెలిపారు. 100 పడకల ఆస్పత్రి శంకుస్థాపన, నూతన బస్టాండ్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కు అభివృద్ధి ఎజెండా ఏమి లేదని కేవలం ఆరోపణలకే పరిమితమవుతున్నారని అన్నారు. వారికి ప్రజలే సరైన గుణ పాఠం చెబుతారు అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఏఎంసి చైర్మన్ కాశీ నారాయణ, జడ్పీటీసీ ఉష గౌడ్, ఎంపిపి మాధవి బలరాజ్ గౌడ్, కౌన్సిలర్ రాము, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, మండల అధ్యక్షుడు జలెందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్, తదితరులు పాల్గొన్నారు.



చెరువు వద్ద బతుకమ్మ మెట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఛత్రపతి శివాజీ అడుగుజాడల్లో నడవాలి

- తడిహిప్పర్గలో విగ్రహం ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం లోని తడి హిప్పర్గలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ గంగారం, అరుణ తార, గ్రామ సర్పంచ్ ప్రకాష్ గాయక్వాడ్ వివిధ పార్టీల ముఖ్య నాయకులు గ్రామ పెద్దలు కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని కొనియాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఎంపీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులకు ప్రతి ఒక్కరికి గ్రామం తరపున శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దలు గ్రామస్తులు కలిసి గ్రామంలో పెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్యాబోధన



బడిబాట ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొట్టాల్‌లో గురువారం ప్రొ.జయశంకర్ బడిబాట ర్యాలీ చేపట్టారు. తెలంగాణ టీచర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు యం.డి. ముజిబొద్దీన్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. ఉచిత ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత వర్క్ బుక్స్, కాపీలు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం లభించునని, స్కాలర్షిప్ అవకాశం ఉందని, ప్రతి ఒకరు తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి ఉచిత విద్యను అందిచాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను బడి ఈడు పిల్లలందరూ వినియోగించుకోవాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం 5వ తరగతి గురుకులంలో, 6వ తరగతి మాడల్ స్కూల్ లో అడ్మిషన్స్‌కు 80 శాతం కోటా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిపై కేసు

నవతెలంగాణ-గాంధారి

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్టు గాంధారి ఎస్‌ఐ డి సుధాకర్ గురువారం తెలిపారు. గాంధారి మండలంలోని తిప్పారం, నేరాల్, గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను, చద్మల్ గ్రామామంలో ఇద్దరిపై, తిప్పారంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులు నమోదు చేయడంలో ఎస్సై సుధాకర్ వెంట సిబ్బంది కిషన్, ప్రకాష్ ఉన్నారు.

కృష్ణాజివాడిలో చేపల మందు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి



చేపల మందు వేస్తున్న దృశ్యం

తాడ్వాయి మండలం కృష్ణాజి వాడిలో మృగశిర కార్తి సందర్భంగా గురువారం గ్రామానికి చెందిన పోలీస్ రాజేశ్వరరావు చేపల మందు పంపిణీ చేశారు. ధన్వంతరి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. సొసైటీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా చేపల మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ చేపల మందుతో అనేక రోగాలు నయమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ దుకాణాలు
- జనరిక్ మందులు సైతం ఎమ్మార్పీ ధరకే విక్రయాలు
- ఫార్మసిస్ట్ లేకున్నా మందుల విక్రయాలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ ఫార్మసిస్ట్ లేకుండానే ఫార్మసీలను నడిపిస్తున్నారు. పలు చోట్ల ఆర్‌ఎంపీ, పీఎంపీలే ఫార్మసీలను నడిపిస్తుండటం కొసమెరుపు. అయితే నాణ్యమైన మందులు ఉండటం లేదని, కల్తీ ఔషదాలు విక్రయాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. జనరిక్ మందులను సైతం ఎమ్మార్పి ధరలకే విక్రయిస్తుండటంతో రోగుల జేబులు గుల్లా అవుతున్నాయి. అనుమతులు తీసుకోకుండా కొనసాగుతున్నా.. సంబంధిత డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదని, 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకో దాచుకో అన్న చందంగా మారిపోయింది. మెడికల్ షాప్‌లలో అమ్మే మందులపై దుమ్ము దూళీ అలానే ఉన్నా వాటన్నింటిని పక్కనపెట్టి, ఏది అసలు మందులు, ఏవి నకిలి మందులో, అర్థం కాని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఆర్‌ఎంపి, పి.ఎం.పి నుండి మొదలుకొని ఎంబిబిఎస్, ఎంఎస్, ఎండిలు తమ ఆసుపత్రికి సంబంధించిన చోటునే మెడికల్ షాపులను తెరుచుకుంటూ ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఆర్‌ఎంపి, పిఎంపీలే మెడికల్ షాపులు పెట్టుకుని, యథేచ్ఛగా డబ్బులను రెండు చేతులా సంపాదించుకుంటున్నారు. మెడికల్ షాప్‌పెట్టక ముందు ఔషధ నియంత్రణ అధికారులు వచ్చి తనిఖీలు చేసి అనుమతులు ఇవ్వవలసి ఉంటుంది. తనిఖీల సమయంలో కనబడే ఫార్మసిస్టులు ఆ తర్వాత కంటికి కనబడకుండా ఉంటారనేది జగ మెరిగిన సత్యం. అధికారులు సైతం మ"ముళ్ళ" గానే చుస్తు మిన్నకుండి పోతున్నరనే వాదనలు వస్తున్నాయి.

ఇదే కాకుండా పలు మెడికల్ షాప్‌లలో జనరిక్ మందులను ఎంఆర్పి ధరలకే విక్రయాలు కొనసాగిస్తున్నరనే విమర్శలు జిల్లా కేంద్రంతోపాటు, మండల, గ్రామాల్లో లేకపోలేదు.

అత్యవసర పరిస్థితుల్లో ఇక చెప్పే అవసరమే ఉండదు. వేరే దుకాణాల నుండి మందులను కొనుగోలు చేద్దామంటే ఆ డాక్టర్ రాసిన మందులు దొరకని పరిస్థితులు ఉన్నాయి. గత్యంతరం లేక ఎక్కడైతే వైద్యునికి చుపించామే అక్కడి నుంచి తెచ్చుకోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు వ్యాపారులు అడ్డగోలుగా మందులు, మత్తు మందులు, నకిలీ మందులను విక్రయిస్తున్నారని, విటిని అరికట్టాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు తమ కేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

మెడికల్ షాపుల్లో కనబడని ఫార్మాసిస్టులు

మెడికల్ దుకాణాలను పర్యవేక్షిం చాల్సిన అధికారులు సిబ్బంది కొరత పేరిట తమకేమీ పట్టినట్లు వ్యవహరిస్తున్నరనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఫార్మసిస్ట్ పేరుతో లైసెన్స్ తీసుకొని వేరే వ్యక్తులు ఫార్మసీలను నడుపుతుండగా.. మరికొన్ని చోట్ల లైసెన్స్‌లేకుండా సైతం కొనసాగిస్తున్నట్టు బహిరంగ రహస్యం.



ఇక హోల్‌సేల్ వ్యాపారులైతే మందులపై ఎక్కువ శాతం డిస్కౌంట్ అందజేస్తామని ఆశ చూపుతూ మెడికల్ షాపులకు పనికిరాని మందులను కూడా పంపిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు మెడికల్ దుకాణాలకు ఇచ్చే ప్రతీ డ్రగ్‌పై బ్యాచ్ నంబరు కలిగి ఉంటుంది. ఇలా రిటైల్ దుకాణాలకు ఇచ్చే సమయంలో బిల్లుపై పొందు పరిచిన బ్యాచ్ నంబర్, కొనుగోలు దారుడికి ఇచ్చే బిల్లుపై రాసే బ్యాచ్ నంబరు కూడా ఒకే విధంగా ఉంటేనే ఆ మందులు సరైనవని నమ్మొచ్చు. కానీ రెండు బిల్లులపై వేర్వేరు నంబర్లు ఉండడం నకిలీ మందుల దందా కొనసాగుతుందనే విమర్శలు అనేకం ఉన్నాయి. ఇకనైనా ఔషధ నియంత్రణ అధికారులు మెడికల్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎంపీ

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని అంకాపూర్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నియోజకవర్గం నుంచి బీజేపీలో చేరిన పైడి రాకేష్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అరవింద్ విచ్చేసి ఆతిథ్యాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సూచరితరెడ్డి, పైడి రేవతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని సన్మానిస్తున్న రాకేష్‌రెడ్డి

రాష్ట్రస్థాయి టెన్ని కోయిట్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్
రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన 7వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికోయిట్ ఛాంపియన్‌షిప్ మహిళా పురుషుల జిల్లా అసోసియేషన్ సారథ్యంలో జిల్లా తరుపున మహిళలు ప్రాతినిధ్యం వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ 5వ స్థానంలో విజయం సాధించినట్టు జిల్లా అధ్యక్షులు పెంట జలంధర్ గురువారం తెలిపారు. సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్ ఈ నెల 16 నుంచి 18 వరకు చెన్నైలోని విరుద్ధం నగర్‌లో జరగబోయే పోటీల్లో నవనీత, ఉమారాణి పాల్గొంటారని, అలాగే జాతీయ సీనియర్‌లో కె.త్రిశా మొదటి స్థానంలో, రెండవ స్థానంలో నవనీత, మూడవ స్థానంలో జె.ప్రసజ్ఞ ఐదవ స్థానంలో ఉమారాణి నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధి మల్లేష్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు భూపతి, సుజాత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపైనే
కవిత, కేటీఆర్ రాజకీయ పుట్టుక

- పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
అబద్ధాల పునాదులపైనే కేటీఆర్, కవిత రాజకీయ పుట్టుక ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం కాంగ్రెస్ భవన్ నందు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ డబ్బు అహంతో మాట్లాడుతున్నాడని, అతి తక్కువ సమయంలో 9 సంవత్సరాల పాలనలో అత్యంత ధనవంతుడిగా ఎదిగిన కుటుంబం కేవలం కేసీఆర్ కుటుంబమని, తొమ్మిది సంవత్సరాలుగా ఏమి సాధించారని ఉత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. కర్ణాటక ఫలితాలే తెలంగాణలో పునరావృతం అవుతాయని ఎందుకంటే కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రజల నడవడి ఒకే విధంగా ఉంటుందని, కర్ణాటక రాష్ట్రంలో ప్రజల డబ్బును ప్రతి ప్రాజెక్టులో 40శాతం కమిషన్‌తో దోచుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించారని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో గుడిని గుడి లింగాన్ని మింగినట్టు ప్రతి ప్రాజెక్టులో 50 నుంచి 60శాతం కమీషన్ తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పంపుతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థి ఎవరని కేటీఆర్ అడుగుతున్నాడని, బీఆర్ఎస్ అనేది కేవలం కుటుంబ ప్రాంతీయ పార్టీ అని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఆదరణ పొందిన వ్యక్తిని సీఎం అభ్యర్థిగా ఉంచుతుందని ఆయన అన్నారు. కేసీఆర్ దేశ రాజకీయాలు చేస్తే రాష్ట్రంలో కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని చెప్తున్నాడని అలా అయితే కేసీఆర్‌కు ఉద్యమ సమయంలో ముందుండి నడిపించిన హరీష్ రావు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. జిల్లాలో సుదర్శన్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు గుత్ప, అలీసాగర్, హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలు, నిజాంసాగర్ ఆధునీకరణ జరిగాయని, ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీలో అవినీతి జరుగుతుంటే దానిని బీఆర్ఎస్ మంత్రి ఎమ్మెల్యేలు ఆపలేకపోతున్నారని ఆయన అన్నారు. మరో పక్క బీజేపీ దేవుని పేరుతో మత రాజకీయాలు చేస్తుందని, కాంగ్రెస్ నాయకులు కూడా దేవుళ్లను పూజిస్తారని, కానీ దేవుడి పేరు మీద ఓట్లు అడగరని, స్థానిక ఎంపీ అరవింద్ రైతులకు పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసి ఇచ్చి ఇప్పుడు పసుపు బోర్డు తీసుకురాకుండా మాట తప్పాడని, రైతులకు క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, మొదటి ఏడాదిలోని రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, వరి పంటను రూ.2500 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందిస్తామని, 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలు కాలేజీకి వెళ్లడానికి ఎలక్ట్రిక్ స్కూటర్ అందిస్తామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ నగర అధ్యక్షుడు కేశ వేణు, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు శేఖర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్

మద్దతు ధర పెంచడం పట్ల హర్షం


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్
కేంద్ర ప్రభుత్వం వారికి మద్దతు ధర పెంచడం పట్ల బీజేపీ ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు గణేష్, రాము మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వరి క్వింటాకు రూ.2183 మద్దతు ధరను పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరానికి రూ.5వేలు లాభం చేకూరుతుందని, అదేవిధంగా 20:20 డీఏపీ ఫర్టిలైజర్స్ 50 కిలోల బ్యాగుపై 200 రూపాయలను తగ్గించిందని అన్నారు. దీంతో ప్రతి రైతుకు ఎకరానికి పదివేల రూపాయలు అధిక లాభాన్ని పొందవచ్చని అన్నారు. కేంద్రం రైతు అభివృద్ధికి కృషి చేస్తుంటే రాష్ట్రం మాత్రం కేవలం ప్రచార ఆర్భాటాలతో పరిమితమై రైతులను కష్టాల్లో ఊబిలోకి నెట్టుతోందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిల్లి శ్రీకాంత్, రామకృష్ణ, రాజేందర్‌గౌడ్, కాంతం రెడ్డి, బాలగంగాధర్, భూషణ్, బండారి శేఖర్, గంగాధర్, అంకిత రైతులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు



సాధించిన పతకాలు చూపుతున్న క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్
ఈ నెల 6 నుంచి 8 వరకు ఆర్డీటీ స్టేడియం అనంతపూర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మినీ సబ్ జూనియర్ (అండర్-11 అండర్-13) బాలబాలికల జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు 32 మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టులో పాల్గొని రాష్ట్ర జట్టు విజయంలో పతకంలో కీలకపాత్ర పోషించారు. అండర్ 11 బాలుర విభాగంలో రజత పతకం, అండర్ 11 బాలికల విభాగంలో కాంస్యపతకం, అండర్ 13 బాలబాలికల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు.

ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్, సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో ప్రవీణ్ అనౌకర్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శోభన్ బాబు చేతుల మీదుగా పతకాలు అందుకున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. రాష్ట్ర జట్లకు కోచ్ మేనేజర్లుగా జిల్లాకు చెందిన మర్కంటి గంగామోహన్, గంగాధర్ సంతోష్, శ్రీకాంత్, సాయికుమార్, జోష్న, భూల, రాణి, సెంథిల్, అశోక్ వ్యవహరించారు.

హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన


ధ్వజ స్థంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ హనుమాన్ ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రదీప్ శర్మ, దినేష్ శర్మ, ఆంజనేయ శర్మ, ఉమేష్ శర్మ, కార్తిక్ శర్మ శాస్త్రోక్తంగా యంత్ర ప్రతిష్టాపన, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన, హెూమం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. వేద పండితులను ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఆలయ కమిటీ కార్యదర్శి సతీష్, కోశాధికారి భూమయ్య, నారాయణ్ రావు, రాజేందర్‌గౌడ్, వరలక్ష్మి శ్రీను, లింగాగౌడ్, లక్ష్మయ్య, గడ్డం శంకర్, ఎల్టీకుమార్, సత్యనారాయణగౌడ్, ముత్తెన్న, నరహరి, మురళి, సంతోష్ ఆలయ కమిటీ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పట్టణంలో బడిబాట


బడిబాటలో నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ స్థానిక కౌన్సిలర్ సంగీత ఖాందేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సంధ్యా రాణి, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు శోభ, అరుంధతి, బీఆర్ఎస్ నాయకులు ఖాందేశ్ సత్యం, ప్రశాంత్, సాయినాథ్, నరేష్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో బాధ్యతగా వ్యవహరించాలి

- డీఐఈఓ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ప్రక్రియ లో చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విధులను నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ ఆదేశించారు. ఈ నెల 12 నుంచి జరగనున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ మాట్లాడుతూ సెల్ ఫోన్‌ల వాడకం విషయంలో బోర్డు నిబంధన మేరకు పని చేయాల్సి ఉంటుందని సూచించారు. ప్రతి ఒక్కరూ విధుల నిర్వహణలో చాకచక్యంగా, పకడ్బందీగా వ్యవహరిస్తేనే సులభంగా పరీక్షలు నిర్వహన సాధ్యమవుతుందని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లు నిబంధనల మేరకు విధి నిర్వహణ చేయాల్సి ఉంటుందని, పరీక్షకు ముందు చేయాల్సిన ఏర్పాట్లను, అలాగే పరీక్ష జరుగుతున్నప్పుడు, పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన విధులలో ఎట్టి పరిస్థితులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు. అనుభవజ్ఞులైన వారిని మాత్రమే విధులలో నియమించామని, వీరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రశ్నపత్రాల ను ఇదివరకే ఆయా పోలీస్ స్టేషన్లో నిక్షిప్తం చేశామని, అవసరమైన మరిన్ని ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్లకు చేరవేస్తున్నామని అన్నారు. రాబోయేది వర్షాకాలం అందుకు జవాబు పత్రాలను పాలిథిన్ కవర్లలో కట్టాలని ఆదేశించారు.

దశాబ్ది ఉత్సవాలు కాదు.. పేదలకు ఇండ్లు ఇవ్వండి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ-ఆర్మూర్
బంగారు తెలంగాణలో పేద ప్రజల బతుకులు మార్చకుండా, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, నేడు 10 సంవత్సరాలు గడుస్తుందని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని విధానాన్ని వ్యతిరేకిస్తూ, అర్హులైన పేదవాళ్లందరికీ డబుల్ బెడ్ రూములు, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. వందల వేల కోట్ల రూపాయలను వృథా చేస్తూ దశాబ్ది ఉత్సవాల పేరుతో పేద ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నారని అన్నారు. ఆ డబ్బుని పేద ప్రజలకు అందిస్తే వందలాది, వేలాది, ఇండ్లు పేద ప్రజలకు నిర్మించవచ్చని, కానీ ఆ విధంగా ఆలోచించకుండా వృథా చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలను ఎలక్షన్లకు పావులా వాడుకుంటూ, ఎలక్షన్ కాగానే, ప్రజలు గుర్తు రారు, వారికి కనబడరు, కనీసం పేదలు ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే, నివాసముంటే ఆ గుడిసెలను కూడా తీసేసి ఎమ్మెల్యే ఆక్రమించుకుంటూ ఉన్నాడని, ఈ విధానాన్ని సాగిస్తే పేద ప్రజలకు అండగా ప్రజాపంథా జెండా అండగా ఉంటుందని వారు హెచ్చరించారు. అదేవిధంగా సీపీఐఎంఎల్ ప్రజా పంథా సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్ మాట్లాడుతూ.. పేదల కోసం, పేదల హక్కుల కోసం, ఎర్రజెండా పోరాటాలు చేస్తుందని, వారికి తెల్ల రేషన్ కార్డులు ఇచ్చేంతవరకూ, స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇచ్చేంతవరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో డబుల్ బెడ్ రూములు ఇచ్చేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని, వారి పక్షాన ఉంటూ పోరాటాల వైపు తీసుకొస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తెన్న, సబ్ డివిజన్ నాయకులు ఆకుల గంగన్న, రమేష్, నరేందర్, అనిల్, నాయకులు నజీర్, కోట్ల రాజు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నేడు చలో ఉస్మానియా

- యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర మహాసదస్సు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తమను రెగ్యులరైజ్ చేయాలని, న్యాయమైన డిమాండ్‌లను నేరవేర్చాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 9న (నేడు) 'చలో ఉస్మానియా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్-జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డాక్టర్ ఎ.పరశురాం, డాక్టర్ డి.ధర్మతేజ, డాక్టర్ వేల్పుల కుమార్, వెంకటేష్ తెలిపారు. బుధవారం వారు ఓయూలో సమావేశం నిర్వహించినట్లు తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు దత్తాహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న చలో ఉస్మానియా పేరుతో ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 57లో 'కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్' రాష్ట్ర మహాసదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, గౌరవ అతిథులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం, ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పద్మావతి, పాలమూరు యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రాజారత్నం, ప్రత్యేక ఆహ్వానితులుగా ఓయూ మ్యాథమెటిక్స్ హెడ్ ప్రొఫెసర్ కిషన్, ప్రొఫెసర్ కాసీం, ఓయూ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ వక్తలుగా హాజరవుతారని తెలిపారు. మహా సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 12 యూనివర్సిటీల నుంచి పెద్ద ఎత్తున కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు హాజరవుతున్నారని జేఏసీ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు సానుకూల దృక్పథంతో పరిష్కారించాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.



కళాశాల ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఈ నెల 6,7న మేడ్చల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, రాష్ట్ర మహాసభల్లో 'మున్సిపల్ వర్కర్స్ యూనియన్' రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నందున గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో, వారికి యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పర్మినెంట్, ఎన్ఎంఆర్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పి.నరసింగరావు మాట్లాడుతూ.. తనను ఏకగ్రీవంగా రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ప్రధానంగా పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్ ఇప్పించడంతోపాటు అర్హులకు ప్రమోషన్ 12వ పీఆర్‌సీ కోసం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేలు వేతనం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా పర్మినెంట్ ఎంఎంఆర్ కార్మికుల కోసం 2012 జీవో అమలు ఇతర సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు నరసమ్మ చిన్నుబాయి, సాయి, నరసయ్య, సుజాత, గోపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నర్సింగరావును సన్మానిస్తున్న నాయకులు

రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి
వెనుకబడిన కులాల వృత్తులు, చేతి వృత్తి కళాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన చేతివృత్తుల వారికి 18 నుంచి 55 ఏండ్లలోపు వారికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డిచ్‌పల్లి, ఇందల్‌వాయి ఎంపీడీఓలు గోపిబాబు, రాములు నాయక్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 06 నుంచి ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో, మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ కింది అర్హతలు కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థుల వ్యక్తిగత వయస్సు 18 నుంచి 55 ఏండ్ల వరకు జూన్ 2 2023 వరకు నిండి ఉండాలని పేర్కొన్నారు.

వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2లక్షలు మించకుండా ఉండాలని, దరఖాస్తు తేదీ నుంచి గత 5 సంవత్సరాల లోపు ఏ ప్రభుత్వ శాఖ ద్వారా అయిన ఆర్థిక లబ్ధిపొందిన వారు, 2017-18లో రూ.50వేలు లబ్ధి పొందిన వారు అర్హులు కాదన్నారు. ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న తర్వాత దరఖాస్తును, వారి కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, ఆహార భద్రత కార్డ్, పాస్‌పోర్టు సైజు ఫోటో, బ్యాంక్ పాస్ బుక్ జతపరిచి సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. వెనుక బడిన కులాలు, నాయీ బ్రాహ్మణులు, రజక, సాగర, ఉప్పర, కుమ్మరి/శాలివాహన, ఔసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల లేదా వాద్రా లేదా వడ్రంగి శిల్పి, కృష్ణ బలిజ పూసల, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేరా, ఎంబీసీ (అత్యంత వెనుకబడిన తరగతి) వారే అర్హులని తెలిపారు.

పతకాలు సాధించడం అభినందనీయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలో ఆర్డిటి స్టేడియంలో జూన్ 6 నుంచి జూన్ 8వరకు జరిగిన మినీ సబ్ జూనియర్ (అండర్-11) సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి పాఠశాల విద్యార్థులు కిషోర్, శ్రీశాంత్ రజత పతకాలు అందుకున్నారు. ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల పలువురు వారిని అభినందించారు. రాబోవు రోజుల్లో మరింత మెరుగైన ఆట తీరును కనబర్చుతారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగమోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి సంబంధించిన (పాలిసెట్ 2023) కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కూమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్లాట్ బుకింగ్ (సర్టిఫికెట్ ధృవీకరణ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ ధృవీకరణకు హాజరు కావడానికి తేదీ, సమయం, ఆన్‌లైన్ ఎంపిక తేదీలు ఈ నెల 14 నుంచి 18 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. స్లాట్ బుక్ చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ ధృవీకరణ ఈ నెల 16 నుంచి 19 వరకు ఉంటుందని, పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు పాలిసెట్-2023 ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్హత ధృవపత్రం, టీసీ, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులు 2023 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో సెంటర్‌కు రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. సర్టిఫికెట్ల ధృవీకరణ తర్వాత కళాశాలలు, శాఖల ఆన్లైన్ ఎంపిక ఈ నెల 16 నుంచి 21 వరకు ఉంటుందని తెలిపారు. జూన్ 25న సీట్లు కేటాయింపు జరుగుతుందని ఆయన తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ జూన్ 25 నుంచి 29 జూన్ వరకు చెయలని వివరించారు.